క్లుప్తంగా

మహారాజా కో-ఆపరేటివ్ బ్యాంకు నేడు ప్రారంభం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కాకినాడ భానుగుడి సెంటర్‌లోని పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కాంప్లెక్సులో మహారాజా కో-ఆపరేటివ్ బ్యాంక్ ఏడో బ్రాంచ్ గురువారం ప్రారంభిస్తున్నట్లు బ్యాంకు అధ్యక్షుడు యం.రామకృష్ణంరాజు తెలిపారు. కాకినాడలోని ఒక హోటల్‌లో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ బ్యాంకును ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. ముఖ్యఅతిథిగా ఎంపీ వంగా గీత పాల్గొంటారన్నారు. తమ బ్యాంకు రూ. 410 కోట్లు టర్నోవర్ కలిగి ఉందని, రిజర్వు బ్యాంక్ నియమ, నిబంధనలు ఆచరిస్తూ ఖాతాదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్యాంకు జీఎం ఎన్ఎం సత్యనారాయణ, డైరెక్టర్ లక్ష్మణమూర్తిరాజు పాల్గొన్నారు.

ఘనంగా లయన్స్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం

కాకినాడ రూరల్: లయన్స్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. లయన్ అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ 1917 జూన్ 7న చికాగోలో మెల్విన్ జోన్స్ కొందరు స్నేహితులు కలసి లయన్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు.

పేదలకు పండ్లు పంపిణీ



పేదలకు పండ్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో జాతీయ దర్జీల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దర్జీ అల్లం కుమార్ రాజా ఆధ్వర్యంలో కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హౌ చిత్రపటానికి నివాళులర్పించారు. పేదలకు పండ్లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ హాజరయ్యారు. కార్యక్రమంలో రేలంగి బాపిరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ నాయకులకు సత్కారం



సత్కారం పొందిన బీజేపీ నాయకులు

కాకినాడ రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ 9 ఏళ్ల అభివృద్ధి పాలనను పురస్కరించుకుని ఈనెల 30 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా బుధవారం రూరల్ నియోజవర్గ పరిధిలో బీజేపీ సీనియర్ నాయకులను సత్కరించినట్టు ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు తెలిపారు. 48వ డివిజన్ పరిధిలో కవికొండల భీమశేఖర్ నివాసంలో పార్టీ సీనియర్ నాయకులు పైడా కృష్ణమోహన్, పైడా భావన ప్రసాద్, ముమ్మిడి పెదకాపు, కేతినీడి విజయరామయ్య, తదతరులను సత్కరించారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.


డ్రైన్లు శుభ్రం చేయరూ



విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాల రోడ్డులో మురుగుతో నిండిన డ్రైనేజీ

బోట్‌క్లబ్: స్థానిక విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాల రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైన్లలో సిల్టు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. స్థానికులు పారిశుధ్య సిబ్బందికి ఎంత చెప్తున్నా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీ శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాధినిరోధక శక్తిని పెంపొందించుకోవాలి



వ్యాధినిరోధక సపోర్టు కిట్లను అందజేస్తున్న డాక్టర్ సౌజన్య, నందివర్ధిని

కరప: భీమాబాయి మహిళామండలి స్వచ్ఛంద సేవాసంస్థ అందిస్తున్న న్యూట్రిషన్ సపోర్టు కిట్లను సక్రమంగా వినియోగిస్తూ, వ్యాధి నిరోధకశక్తిని పెంపొందించుకోవాలని వేళంగి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎంకే సౌజన్య సూచించారు. వేళంగి పీహెచ్‌సీలో బుధవారం మండల భీమాబాయి మహిళామండలి అధ్యక్షురాలు వి.నందివర్ధని ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యాధి నిరోధకశక్తి కోల్పోయిన 55 మందికి ఒక్కొక్కరికి రూ.600 విలువచేసే కిట్లను ఆమె పంపిణీచేశారు. మండలి సభ్యులు ఏవీ శ్రీదేవి, డి.చంద్రకళ, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పఠనాసక్తే లక్ష్యం

- నేటితో ముగియనున్న గ్రంథాలయ వేసవి శిబిరాలు
- వివిధ అంశాల్లో విద్యార్థులకు శిక్షణ

బాలాజీచెరువు: ఆధునిక ప్రపంచం సాంకేతికంగా ఎంతో వృద్ధి సాధించింది. మరో పార్శ్వంలో సాంకేతికతకు అందని, అర్థంకాని ఎన్నో శాస్త్రాలు, అంశాలు చరిత్రగా మిగిలిపోయి కాలగర్భంలో కలసిపోయాయి. చారిత్రక అంశాలు తెలుసుకునేందుకు మూలాధారమైన ఎన్నో తాళపత్ర గ్రంథాలు, అచ్చుకు నోచుకున్నవి కొన్ని, అర్థం కాక వదిలేసినవి కొన్ని, కాల గతిలో కలిసిపోయినవి కొన్ని. అందులో మళ్లీ అచ్చుకు నోచుకున్న ఎన్నో పుస్తకాలు, గ్రంథాలు కొన్ని మాత్రమే డిజిటైజ్ అయ్యాయి. మరికొన్ని శిథిలమైపోయాయి. ఈ నేపథ్యంలో ఏ పుస్తకం ఎక్కడ ఉందో.. ఏ పరిస్థితిలో ఉందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. క్రమేపీ గ్రంథాలయాలు నిర్వీర్యమైపోవడం. పాఠకులు తగ్గిపోవడం అన్నది నేడు మనకు కనిపిస్తున్న పోకడ. ఈ పరిస్థితిని ఆనాడే గుర్తించారేమో. పాఠకుడే లేకపోతే ఎన్ని గ్రంథాలుండి ఏం ఉపయోగం. ఎంత సాహిత్యం, ఎంత విద్య, వైజ్ఞానిక అంశాలు ఉండి ఏం లాభం. పాఠకాదరణ, గ్రంథాలయాల అభివృద్ధి లక్ష్యంగా ఎందరో సాహితీవేత్తలు, మహానుభావులు ఉద్యమబాట పట్టారు.

ఈ క్రమంలో గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 1911 రామమోహన గ్రంథాలయాన్ని స్థాపించారు. ఈ గ్రంథాలయ ప్రతినిధుల ఆధ్వర్యంలోనే సాహితీవేత్త చిలకమర్తి లక్ష్మీనరసింహం అధ్యక్షతన గ్రంథాలయాల అభివృద్ధే లక్ష్యంగా 1914లో మొట్టమొదటి గ్రంథాలయోద్యమ మహాసభ నిర్వహించి ఎన్నో పోరాటాలు చేశారు.

వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునే లక్ష్యంతో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏటా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ శిబిరాలు గురువారంతో ముగియనున్నాయి. రెండేళ్లుగా కోవిడ్ నేపథ్యంలో నిర్వహించలేదు. ఈ ఏడాది పరిస్థితులు సద్దుమణగడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవి శిబిరాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందేలా, వారిలో మేధస్సు వృద్ధి చెందేలా వివిధ అంశాలలో శిక్షణ ఇచ్చారు. నగర పరిధిలో జిల్లా గ్రంథాలయంతో పాటు గ్రేడ్-1 రెండు, గ్రేడ్-2 రెండు, గ్రేడ్-3 మూడు గ్రంథాలయాలతో పాటు, పుస్తక నిక్షిప్త కేంద్రాలు (బీడీసీల) పది వరకూ ఉన్నాయి. గత నెల 18వ తేది నుంచి ప్రారంభమై గురువారంతో ముగిసేలా కార్యాచరణ రూపొందించి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. పుస్తక పఠనం, కథలు చెప్పించడం, ప్రముఖులతో అవగాహన సదస్సులు, చెస్, క్యారెమ్స్ తదితర ఆటల్లో శిక్షణ ఇచ్చారు.



కుళాయిచెరువు పార్కు ఆవరణలో ఉన్న గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులు హాజరయ్యేలా..



విద్యార్థులు స్వచ్ఛందంగా హాజరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. కొందరి నంబర్లు సేకరించి గ్రూప్‌గా ఏర్పాటు చేసి ప్రతి రోజూ సమాచారం అందజేసి సమాచారం ఇస్తాం. దాతల సాయంతో ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తాం.

-ఎం.శ్రీనివాసరావు, లైబ్రేరియన్, కాకినాడ



చిన్నారులు గీసిన చిత్రం

స్వచ్ఛంద సేవలకు అవకాశం..

పేద విద్యార్థులకు సేవ చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశం. స్పోకెన్ ఇంగ్లిష్, చెస్, డ్రాయింగ్, తెలుగు పండితుల నుంచి మంచి ప్రతిభ ఉన్నవారు ఈ గ్రంథాలయాల ద్వారా స్వచ్ఛందంగా సేవలందించేందుకు గ్రంథాలయ సంస్థ అవకాశం కల్పిస్తోంది.

ప్రణాళికాబద్ధంగా నగరాభివృద్ధి

కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్



డివిజన్లలో అభివృద్ధి పనులపై అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ: కాకినాడ నగరాన్ని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల పేర్కొన్నారు. బుధవారం ఆయన 8, 38, 47, 49 డివిజన్లలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల ప్రణాళికపై పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారం కూడా ఉన్నప్పుడే నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దగలమన్నారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన పలు అంశాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగశాస్త్రులు, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా సమ్మర్ క్రికెట్ టోర్నీ



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ విజేతలకు సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

కరప: మండలం వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నీ జోరుగా సాగుతోంది. నో ఏజ్ లిమిట్ విభాగంలో బుధవారం ప్రీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో చొల్లంగి జట్టుపై బాపనపల్లి జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నాగరాజు(బాపనపల్లి) నిలిచాడు. రెండో మ్యాచ్‌లో కుయ్యేరు టీమ్‌పై పటవల టీమ్ గెలుపొందింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా మురళి (పటవల) నిలిచాడు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ఆర్జేడీ ఉమారాణి

కాకినాడ సిటీ: అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులతో పాటు ఆధునిక సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, వీటిని స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించేలా జిల్లా, మండల స్థాయి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఏలూరు రేంజి ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు కె.ఉమారాణి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని విధానగౌతమి కార్యాలయంలో కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని సీడీపీవో, సూపర్‌వైజర్స్‌తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. సివిల్ వర్క్స్, ఎస్‌డీజీ ఇండికేటర్స్, సివిల్ సప్‌లై స్టాక్స్, పాలు, గుడ్లు, బాలామృతం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు, పథకాలకు సంబంధించి పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలల హక్కుల రాష్ట్ర కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టడానికి జిల్లా స్థాయి నుంచి మండల,



కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల సీడీపీవోలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్జేడీ ఉమారాణి

గ్రామస్థాయి వరకు గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. జిల్లా ప్రాజెక్టు అధికారి కె.ప్రవీణ మాట్లాడుతూ జిల్లాలో నాడు-నేడు రెండో దశ కింద మంజూరైన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను ఇంజినీరింగ్, సచివాలయ సిబ్బంది సహకారంతో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. స్థానికంగా ఉన్న సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పునాది స్థాయిలో ఉన్న భవనాలను వారం రోజుల్లో రూఫ్ స్థాయికి నిర్మించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం నోడల్ అధికారి లక్ష్మి, రెండు జిల్లాల పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ చట్టాన్ని సవరించాలి

కరప: కౌలు చట్టాన్ని (సీసీఆర్‌సీ) సవరించి రైతులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ అన్నారు. భూ యజమాని సంతకం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కౌలురైతు రాష్ట్ర జాత ప్రచారంలో భాగంగా బుధవారం నిర్వహించిన జీపు జాత నడకుదురు, పెనుగుదురు, కరప, వలసపాకల, యండమూరు గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కౌలురైతు రక్షణయాత్ర రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 11వ తేదీ వరకు నాలుగు ప్రాంతాల్లో జీపు యాత్ర జరుగుతుందని, ఈ నెల 12వ తేదీన విజయవాడ నుంచి ప్రకాశం బ్యారేజీ మీదుగా మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయం వరకు పాదయాత్ర జరుగుతుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.బాలకృష్ణ, కార్యదర్శి వల్లు రాజబాబు, లంక చంద్రరావు, ఎస్.చిన్నారావు, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.



నడకుదురులో కౌలు రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న సంఘం నాయకులు

జెడ్పీటీసీలకు ముగిసిన శిక్షణ



జెడ్పీటీసీ సభ్యులకు సర్టిఫికెట్లు అందజేసిన అధికారులు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో జెడ్పీటీసీ సభ్యులకు శిక్షణ కొనసాగుతోంది. ముగింపు శిక్షణలో ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని సభ్యులకు ఇచ్చిన సమచారంతో కూడిన పుస్తకాలను పూర్తిగా చదవాలని సూచించారు. పరిపాలన విధానంపై అవగాహన ఉన్నప్పుడు మాత్రమే అధికారులను ప్రశ్నించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. వివిధ అంశాలపై ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఈ.కృష్ణమోహన్, హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజు, ఈటీసీ ఫ్యాకల్టీలు శ్రీదేవి, ప్రసాద్, ఎంఎస్ఎన్ రెడ్డిలు శిక్షణ నిర్వహించారు. అనంతరం సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు.

కుమార్తె ఆరోగ్యాన్ని కాపాడండి

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలెం గ్రామానికి చెందిన ఆరుద్ర తన కుమార్తె ఆరోగ్య సమస్యను పరిష్కరించాలని బుధవారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ఆమ్‌ఆద్మీ, వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు సంఘీభావం ప్రకటించారు.

దొమ్మేటికి ఘనంగా నివాళులు



దొమ్మేటి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శెట్టిబలిజ సంఘం నాయకులు

కరప: తాళ్లరేవు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దొమ్మేటి వెంకటేశ్వర్లు సంతాప సభ స్థానిక చిరంజీవి కళ్యాణమండపంలో బుధవారం నిర్వహించారు. మండల శెట్టిబలిజ సంఘం నాయకుడు వాసంశెట్టి స్వామీ చంద్రబోస్ అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సహకారంతో గౌరిపూడిలో ఎత్తిపోతల పథకం నిర్మించి సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరందించారని, మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారని పేర్కొన్నారు. మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరావు, యు.కొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసికుమార్, మాజీ వైస్ ఎంపీపీ యాసలపు దుర్గాప్రసాద్, కరప ఏఎంసీ మాజీచైర్మన్ అల్లు శివ, జిల్లా ఆరోగ్యమిత్ర సంఘం అధ్యక్షుడు వంచెర్ల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతల ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కరప: మండలం వేళంగి గ్రామ దేవతలైన మారెమ్మ, పాలమ్మతల్లి ఆలయ నిర్మాణానికి బుధవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. గ్రామస్తుల వినతి మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.10 లక్షలు మంజూరుచేయగా, గ్రామస్తుల విరాళాలతో ఆలయ నిర్మాణం చేస్తున్నట్టు సర్పంచ్ సవిలే నీలిమ తెలిపారు. మాజీసర్పంచ్ ముత్యాల శ్రీనుబాబు, మాజీ ఉపసర్పంచ్ కంచికొండ దంపతులతో భూమిపూజచేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, దళిత రచయిత సవిలే రాజేష్, ఉపసర్పంచ్ కుంచే అయ్యన్న, వైఎస్సార్ సీపీ గౌరవాధ్యక్షుడు గరగ జెమ్మి, అధ్యక్షుడు జీలకర్ర దుర్గారావు, ఎంపీటీసీ సభ్యులు కొప్పిశెట్టి మంగయ్యమ్మ, ముసిని సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



వేళంగిలో గ్రామ దేవతల ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సీఎస్సార్ నిధులతో కమ్యూనిటీ భవనాల అభివృద్ధి



నీలపల్లిలో సామాజిక భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులతో మండలంలోని కమ్యూనిటీ భవనాలను అభివృద్ధి చేయనున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రమైన తాళ్లరేవులో ఉన్న అంబేడ్కర్ భవన్‌పై రూ.36 లక్షల వ్యయంతో వేయనున్న పైఅంతస్తు భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసారు. బౌద్ధ ఉపాసకులు ఎడ్ల కుటుంబరావు బౌద్ధ సాంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యే పొన్నాడతో పూజలు చేయించారు. అదేవిధంగా నీలపల్లి గ్రామ పంచాయతీలో గత 12 ఏళ్లగా అసంపూర్తిగా నిలిచిపోయిన సామాజిక భవనం ఆధునీకరణకు సీఎస్ఆర్ నిధులు రూ.25 లక్షలు కేటాయించగా ఆ పనులకు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యులు శామ్యూల్‌సాగర్ పాల్గొన్నారు.

కొత్త పీహెచ్‌సీని నీలపల్లికి కేటాయించాలి



ఎమ్మెల్యే పొన్నాడకు వినతిపత్రం అందజేస్తున్న నీలపల్లి సర్పంచ్ నాగమణి

తాళ్లరేవు: మండలానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జూనియర్ కళాశాలలను నీలపల్లి గ్రామ పంచాయతీకి కేటాయించాలని సర్పంచ్ చిట్టూరి నాగమణి, స్థానిక నాయకులు కోరారు. బుధవారం స్థానిక అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన పొన్నాడను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. నీలపల్లి, జార్జిపేట గ్రామ ప్రజలు విద్య, వైద్యం కోసం తాళ్లరేవు లేదా కాకినాడ వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో వాటిని నీలపల్లి గ్రామ పంచాయతీకి కేటాయించాలని, వాటి ఏర్పాటుకు స్థలం కూడా సమకూర్చనున్నట్లు సర్పంచ్ నాగమణి తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో స్థానిక నాయకులు రెడ్డి సతీష్, రేవు మల్లీశ్వరి, చిట్టూరి కలికిమూర్తి, మోకా మధుబాబు, కట్టా దుర్గారావు, బత్తుల అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

కార్మికుడి ఇంట్లో చోరీ

- రూ.80 వేల విలువైన బంగారు నగలు..
- రూ.92 వేల నగదు అపహరణ

సామర్లకోట: స్థానిక రాక్ సిరామిక్స్ కార్మికుడు పువ్వుల సుధాకర్ ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురైంది. స్థానిక సత్యనారాయణపురంలో సుధాకర్, స్వరూప దంపతులు అద్దెకు ఉంటున్నారు. వేసవి తాపానికి తాళలేక సమీపంలోనే ఉన్న స్వరూప తల్లి ఇంటిలో ఏసీ ఉండడంతో మంగళవారం రాత్రి ఇంటి తలుపులకు తాళం వేసి అక్కడ నిద్రించేందుకు వెళ్లారు. ఇది గమనించిన దొంగలు మొదటి అంతస్తులోని ఇంటి తలుపుల తాళాలు, బీరువా తాళాలు పగలు గొట్టి రూ.80 వేల విలువైన బంగారు గొలుసు, రెండు ఉంగరాలు, దుద్దులు, రూ.92 వేలు నగదు దోచుకుపోయారు. రెండు బీరువాల్లోని బట్టలను కింద పడవేసి బీరువాలోను, డబ్బాలోను ఉన్న నగదు, ఆభరణాలు దోచుకుపోయారు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చిన దంపతులు తలుపులు తెరిచి ఉండటం గమనించి చోరీ జరిగినట్టు గుర్తించారు. భార్యకు నల్లపూసలు చేయించేందుకు పొదుపు చేసిన మొత్తాన్ని దోచుకుపోయారని సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశాడు. వార్డు కౌన్సిలర్ సేసేని సురేష్ ఫిర్యాదు మేరకు సీఐ కె.దుర్గాప్రసాద్, ఎస్సై టి.సునీత, క్లూస్ టీమ్ బృందం సంఘటనా ప్రదేశాన్ని సందర్శించి సమాచారం సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్సై సునీత

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

పిఠాపురం: రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన వరి విత్తనాలు అందించాలని డీలర్లకు పిఠాపురం ఏడీఏ పి.స్వాతి సూచించారు. పిఠాపురం పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాలకు చెందిన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలను ముందుగా పరీక్షించి 80 శాతం కన్నా ఎక్కువ మొలకెత్తిన విత్తనాలనే రైతులకు సరఫరా చేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలతో పాటు పురుగు మందులు, ఎరువులు అందించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, ఎంపీఓ, ఎస్ఎస్‌పీతో పాటు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు ఎ.అచ్యుత రావు, సత్యనారాయణ, వి.జోగిరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ స్వాతి

మోసం చేసిన వ్యక్తికి రిమాండ్

సామర్లకోట: స్థానిక గాంధీనగర్‌కు చెందిన గుర్రాన భరతమాత అనే మహిళను మోసం చేసిన సంఘటనలో నిందితుడికి రిమాండ్ విధించారు. పోలీసుల కథనం ప్రకారం భరతమాతను వీరేటి సత్యనారాయణ అనే వ్యక్తి పరిచయం చేసుకొని నమ్మించి ఆమె ఇంటిని విక్రయించి వచ్చిన సొమ్ము ఇవ్వకుండా మోసానికి పాల్పడినట్టు ఫిర్యాదు చేసింది. భరతమాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేసి బుధవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు.